క్లుప్తంగా

108 కలశాలతో అభిషేకం



108 కలశాలకు పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు సురేష్ శర్మ, భక్తులు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం శత చండీ పూర్ణకుంభాభిషేకం, శత చండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో 40 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో యాగాన్ని పూర్తిచేశారు. అనంతరం శివాలయం గోపురానికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం ఉమాసహిత కోటేశ్వరస్వామి ఆలయంలో శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్సీ రఘువర్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రైతులకు రాయితీపై ఎరువులు



రైతులకు ఎరువులు అందజేస్తున్న వీఏఏ

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట రైతు సేవా కేంద్రంలో శుక్రవారం 120 మంది రైతులకు రాయితీపై ఎరువులు పంపిణీ చేసినట్లు వీఏఏ దేముడు తెలిపారు. రాయితీపోను డీఏపీ రూ.1350, యూరియా రూ.267లకు రైతులకు అందజేసినట్లు చెప్పారు. దబ్బిరాజుపేట రైతు సేవా కేంద్రం పరిధిలో దబ్బిరాజుపేట, చామలాపల్లి గ్రామాల్లో 602 ఎకరాల్లో వరి సాగులో ఉందన్నారు. ఇప్పటికే 60 శాతం వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. ఎరువులు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లోకేశ్వరరావు

మెరకముడిదాం: రోడ్లపై ప్రయాణించే సమయంలో కచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని బుధరాయవలస ఎస్సై బి.లోకేశ్వరరావు సూచించారు. గర్భాం జంక్షన్‌లోని ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని, వాహన రికార్డులు వాహనాల్లో ఉంచుకోవాలని, పోలీసులు అడిగినపుడు చూపించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి



మారిక గ్రామంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

వేపాడ: మండలంలో కరకవలస పంచాయతీ శివారు కొండపై ఉన్న మారిక గిరిజన గ్రామాన్ని జనసేన, టీడీపీ నాయకులు శుక్రవారం సందర్శించారు. కరకవలస నుంచి సుమారు 8 కి.మీ దూరంలో ఉన్న కొండపై నివసిస్తున్న మారిక వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మించాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. గిరిజనుల సమస్యలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. జనసేన పార్టీ విశాఖ జిల్లా కన్వీనర్ బి.సత్యనారాయణతో పాటు ఎస్.కోట, వేపాడ మండల జనసేన, టీడీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థుల్లో అంతర్గతంగా ఉన్న సామర్థ్యాలను గుర్తించి వాటిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. మండలంలో రాయుడుపేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, టీఎల్ఎంలు, వర్కుబుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంటకాలు మరింత రుచికరంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ఆవరణలోని పెరటితోటలో సాగుచేస్తున్న కూరగాయ పంటలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజనం మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



గంట్యాడ: మదనాపురం అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు



వేపాడ: వేపాడలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు



గంట్యాడ: కొఠారుబిల్లిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి



జామి: అలమండలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, హెల్త్ సిబ్బంది



దత్తిరాజేరు: పెదమానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాలు అమృత సమానమని, పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు. చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది శుక్రవారం గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. బిడ్డ ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చక్కీలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్




వేపాడ: వేపాడ అంగన్‌వాడీ కేంద్రంలో..

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



కొత్తవలస: 108 శివలింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న రుత్వికులు



జామి: శాకంబరీ అలంకరణలో అమ్మవారు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న ఓం సదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక, నమక, చమకపూర్వక రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆషాఢమాస మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మశ్రీ ఉమామహేశ్వరశర్మ, కిరణ్‌కుమార్ శర్మ, జగన్నాథశర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామికి అభిశేఖాలు, అర్చనలు చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

శాకంబరిగా అమ్మవారు

జామి: ఆషాఢమాసం మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని అలమండ గ్రామంలో విజయదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శర్మ అమ్మవారిని శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వాసవిమాతకు ఆర్యవైశ్యుల సారె

జామి: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం లలితా సహస్రపారాయణం చేశారు.



జామి: అమ్మవారికి సారెపెట్టిన ఆర్యవైశ్య మహిళలు

ఉద్యోగాల్లో స్థానికుల సంఖ్యపై సర్వే

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పరిశ్రమలు, వివిధ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో స్థానికుల సంఖ్యపై వారం రోజుల్లో సర్వే నిర్వహించి, నివేదికను సమర్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన ఎంతవరకు అమలు జరుగుతుందో నిర్ధారించిన నివేదికను దేశ అత్యున్నత న్యాయ స్థానానికి అందజేయాల్సి ఉన్నందున వారంలో రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. పరిశ్రమలు, కర్మాగారాల్లోని ఉద్యోగాల్లో స్థానికతపై వివిధ శాఖల అధికారులతో తన చాంబర్‌లో కలెక్టర్ అంబేడ్కర్ శక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న 196 కర్మాగారాల సంఖ్యపై సర్వే చేయాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌ను, వివిధ పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని జిల్లా పరిశ్రమల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ఇండస్ట్రీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోవిందరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్, డీసీఎల్ సుబ్రమణ్యం, పరిశ్రమల శాఖ డీడీ నాగేశ్వరరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ఇతర అధారులు పాల్గొన్నారు.

రికార్డులకు పటిష్ట భద్రత కల్పించాలి

జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రికార్డులకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. మూడు రోజుల్లో తగు సూచనలతో నివేదిక అందజేయాలని అగ్నిమాపక దళ అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై జిల్లా రిజిస్ట్రార్, ఫైర్ ఆఫీసర్లతో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో కార్యాలయాల వద్ద వాచ్‌మన్‌లను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏపీ కుమారి, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ లక్ష్మణరావు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, తదితరుల పాల్గొన్నారు.

పాఠశాల అవసరం మేరకు ఖాళీల భర్తీ

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి కేజీబీవీలో కుక్, నైట్ వాచ్‌మెన్‌ను తొలిగించి, టీడీపీ సానుభూతి పరులను నియమించడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై సాక్షిలో 'మంత్రి ఇలాకాలో చిరుద్యోగుల తొలగింపు' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనంపై సమగ్ర శిక్ష అధికారులు స్పందించారు. కేజీబీవీల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రతీ విద్యా సంవత్సరం ఖాళీగా ఉన్న కుక్, నైట్ వాచ్‌మెన్, స్వీపర్, ఆయా పోస్టులను పథకం రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు స్థానిక ప్రిన్సిపాల్ డైలీ వేజ్ పద్ధతిలో అవసరమైన సిబ్బందిని నియమిస్తారన్నారు. అయితే 2019 నుంచి కుక్‌గా రొంగలి శ్రీలక్ష్మి, వాచ్‌మెన్‌గా ఆర్.దుర్గ పనిచేస్తున్నారు. పాఠశాల అవసరం మేరకు మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామని అధికారులు చెప్పారు.

ఎండీఎం నిర్వాహకుల తొలగింపు

గుర్ల: మండలంలోని పెనుబర్తి ప్రాథమికోన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను తొలగించినట్లు ఎంఈఓ ఎస్.భానుప్రకాష్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు పెట్టే భోజనాల్లో నాణ్యత పాటించాలని ఎన్నిసార్లు హెచ్చరించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి పాఠశాలలో తనిఖీ చేసి ఎండీఎం నిర్వహకులను తొలిగించాలని ఆదేశాలను జారీ చేశారు. ఆమె ఆదేశాల మేరకు నిర్వాహకులను తొలగించినట్లు చెప్పారు.

దోమల నివారణ మందు పిచికారీ

మెరకముడిదాం: మండలంలోని గర్భాం గ్రామంలో శుక్రవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లోని చెత్తపోగులు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. అన్ని వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

హోంగార్డును కఠినంగా శిక్షించండి

బొండపల్లి: యువతిపై అత్యాచారానికి పాల్పడిన హోంగార్డు ఎం.సురేష్‌ను కఠినంగా శిక్షించడంతో పాటు బాధితురాలిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు పురం అప్పారావు డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉండే విజయగనరం జిల్లాలో ఇటీవల మహిళలపై లైంగిక దాడులు ఎక్కువ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రక్షించాల్సిన పోలీసులే ఇటువంటి చర్యలకు పాల్పడితే ఇక మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. నిందితుడిపై తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్యబోధన అందించాలి



ఎస్ఎంసీ ఎన్నికలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ-1 చంద్రశేఖర్

మెరకముడిదాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎంఈఓ-1 చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని గాదెలమర్రివలస ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు బోధించేటప్పుడు విద్యార్థి సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టేలా చూడాలన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలపై అవగాహన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ-1 చంద్రశేఖర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఎంఈఓ-2 టి.ధర్మశ్రీనుతో కలిసి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు జాబితాలను సిద్ధం చేసి పాఠశాల ఆవరణలో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా..

లక్కవరపుకోట: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వ్యక్తికి స్నేహితులు రూ.80 వేలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని తలారి గ్రామానికి చెందిన తలారి అచ్యుతరావుకు గుండె సంబంధిత శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి అతను ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఎల్.కోట హైస్కూల్‌లో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న తన తోటి స్నేహితులు అతని పరిస్థితిని తెలుసుకుని ఆర్థిక సాయం చేయాలని అనుకున్నారు. వెంటనే తమ స్నేహితుడు, ఎస్సై గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో రూ.80 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం అచ్యుతరావుకు అందజేశారు. కష్టకాలంలో స్నేహితుడికి అండగా నిలిచిన తోటి స్నేహితులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో బండారు కామేష్‌రావు, సురేష్, రామకృష్ణ, సతీష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతరావుకి ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

నిబంధనల మేరకు ఎస్ఎంసీ ఎన్నికలు



బొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు



కొత్తవలస: హెచ్ఎంలతో సమావేశం నిర్వహిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

బొండపల్లి: ఈనెల 8న పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలని, ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, ఏఎస్సై సన్యాసిరావు, ఎంఈఓ-1,2 కె.శోభారాణి, అల్లు వెంకటరమణ, టి.సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: ఈ నెల 8న నిర్వహించే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఈఓ జి.శ్రీదేవి హెచ్ఎంలకు సూచించారు. ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీ, ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

జామి: మండల తహసీల్దార్‌గా ఐ.కృష్ణలత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మంగళగిరిలోని ల్యాండ్స్ సర్వే విభాగంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

బొండపల్లి: మండల తహసీల్దార్‌గా డోల రాజేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తెర్లాం తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఈయన సార్వత్రిక ఎన్నికల ముందు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా బొండపల్లి తహసీల్దార్‌గా వచ్చారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ పి.హరి, సీనియర్ సహాయకులు సత్యనారాయణ, ఆర్ఐ సతీష్, సర్వేయరు శివ, వీఆర్‌ఓలు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

దళిత సత్తా కార్యవర్గ సభ్యుడిగా గౌరీశంకర్

గజపతినగరం: దళిత సత్తా మండల కార్యవర్గ సభ్యునిగా జిన్నాం గ్రామానికి చెందిన పి.గౌరీశంకర్ ఎంపికైనట్లు జిల్లా దళిత సత్తా అధ్యక్షుడు కొత్తల గౌరినాయుడు శుక్రవారం తెలిపారు. మండల దళిత సత్తా కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన గౌరీశంకర్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి ప్రేమలత

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ సూచనలు మేరకు స్థానిక కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రేమలత మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, కానీ ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ డబ్బు, అధికారం, హోదా వంటివాటికి ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఆహార అలవాట్లను మార్చుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యోగా, వ్యాయామాన్ని దైనందిత జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో సుమారు 150 మందికి వైద్యులు సేవలందించారు. బీపీ, సుగర్, తదితర పరీక్షలతో పాటు మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి ఆకులపేట గ్రామానికి చెందిన ఆకుల స్వామినాయుడు, జయలక్ష్మి దంపతులు రూ.51 వేలు ఆర్థిక సహకారం అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ట్రస్ట్ బోర్డు సభ్యులు కోరారు. కార్యక్రమంలో అప్పికొండ ఆదిబాబు, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దాసరి రవి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీను, గొల్లస్వామి, నాగులు పాల్గొన్నారు.



ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎస్సీల వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేని ఎడల ఉద్యమిస్తామని జిల్లా జైబీమ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎస్సీల వర్గీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను తామంతా ఖండిస్తున్నామని, మెజార్టీ ద్వారా పార్లమెంటులో చట్టసవరణ చేయకుండా ఎస్సీల్లోని 59 ఉపకులాల మధ్య చిచ్చుపెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేనిఎడల ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బసవ సూర్యనారాయణ, గుంటుబారిక లక్ష్మణ, ఎత్తుల ఈశ్వరరావు, దూసి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకం

దత్తిరాజేరు: ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషిచేయాలని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. దత్తిరాజేరు ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన రుంకాన భారతికి హైదరాబాద్‌కు చెందిన గొర్తి ఈశ్వరి ట్రస్ట్ రూ.10 వేలు బహూకరించింది. ఈ మొత్తాన్ని ట్రస్ట్ ప్రతినిధి బోని అప్పలనాయుడుతో కలిసి ఎమ్మెల్సీ రఘువర్మ విద్యార్థినికి శుక్రవారం అందజేశారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధి మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్, ఉషాబాల దంపతులు 2015 నుంచి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకం అందజేస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామునాయుడు, విశ్రాంత ఉపాధ్యాయులు చప్ప అప్పలనాయుడు, జోగినాయుడు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, ఉపాధ్యాయులు